
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త




రాత్రింబవళ్లు ఇసుక వాహనాల బీభత్సం

రూరల్‌లో

# రయ్..రయ్





## అంతర్గత రోడ్లపై హైస్పీడ్

(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నివారణకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వాహనాల వేగ నియంత్రణకు కళ్లెం పడటం లేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధాన రహదారులపైనే అధికారులు దృష్టి పెడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అంతర్గత రోడ్లపై పరిగెడుతున్న వాహనాల గురించి పట్టించుకోవడం లేదు.

**స్పీడ్ గన్స్ ప్రధాన రహదారులకేనా ?**

ప్రధాన రహదారులపై పలుచోట్ల స్పీడ్ గన్స్ ఏర్పాటు చేశారు. పరిమితి దాటిన వాహనాలకు రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నారు. దాంతో పాటు ముక్కుపిండి వాహనదారుల నుంచి చలానాలు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఇసుక ట్రాక్టర్ల వేగ నియంత్రణ సాధ్యం కావడం లేదు.



అతివేగంతో ప్రమాదాలకు కారణమైన వాహనాలు

- నాపరాయి, ఎర్రమట్టి లోడు లారీలూ అంతే..
- ఫిట్‌నెస్ లేనివీ అదే వేగం
- నెంబర్ ప్లేట్లు కూడా లేని వాహనాల హల్‌చల్
- బైకులతో బేజారెత్తిస్తున్న కుర్రకారు
- తరచూ ఘోర ప్రమాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- అడపాదడపా తనిఖీలతో సరి!
- చట్టాన్ని చుట్టంగా మారుస్తున్న రాజకీయ జోక్యం

**గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ఇసుక రవాణా**

ఇటీవల తాండూరు సబ్ డివిజన్‌లో ఓ ప్రభుత్వ టీచర్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఆయన తీవ్రగాయాలకు గురైనారు. విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక రవాణా వాహనాలు వేగ నియంత్రణ పాటించడం లేదు. ప్రభుత్వ పనుల పేరిట పర్మిట్లు పొందుతూ అడ్డగోలుగా దందా చేస్తున్నారు. గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ఇసుక రవాణా జరుగుతున్నది. రాత్రింబవళ్ల ఇసుక వాహనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చాలా వాహనాలకు నెంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం. ఇది అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. నాపరాయి, ఎర్రమట్టి తరలించే వాహనాలు కూడా మితిమీరిన వేగంతో దూసుకు వస్తున్నాయి. తరచూ జరిగిన సంఘటనల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. గాయాల పాలవుతున్న వారి సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటోంది.

**తాండూరుకు వచ్చే నాపరాయి లారీలతో దడ**

కరణ్‌కోట, ఓగిపూర్, బాసుపల్లి, మల్కాపూర్ ప్రాంతాల నుంచి తాండూరుకు తరలించే నాపరాయి లారీలు మరీ వేగంగా నడుపుతున్నారు. ఈ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో పట్టణ నడిబొడ్డు నుంచి వెళుతున్నాయి. వాటి వేగ నియంత్రణ అధికారులకు సాధ్యం కావడం లేదు. వీటి వెనక రాజకీయ నేతల ప్రమేయం బాగానే ఉంటుంది. లారీలను పట్టుకున్న వెంటనే నాయకులు రంగంలోకి దిగి విడిపిస్తున్నారు. వీటిలోనూ చాలా వరకు నెంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్నారు.

**వికారాబాద్‌లో డేంజర్ స్పాట్‌లు ఇవీ..**

మూడు రోజుల క్రితం పట్టణంలోని అంతర్గత రోడ్డున ఓ ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన వార్త పట్టణమంతా దావాణంలా వ్యాపించింది. చాలామంది ఉలిక్కి పడ్డారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారంతా యువకులే ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ మాజీ ఎమ్మెల్యే ఇంటి వెనకాల బైక్‌లు ఢీకొని మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఈ కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతోమంది గాయాల పాలవుతున్నారు. యేడాది క్రితం పోలీసుస్టేషన్ చౌరాస్తాలో లారీ చక్రాల కింద పడి ఇద్దరు మృతి చెందారు. శివాజీచౌక్, బస్‌స్టేషన్ వంటి ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వికారాబాద్‌లో ఎన్టీఆర్ కూడలి వద్ద, బీజేఆర్ కూడలి, ఎన్నేపల్లి నుంచి కలెక్టరేట్ వెళ్లే కూడలి, పరిగిలో కొడంగల్ కూడలి, బస్‌స్టేషన్ కూడలి ప్రమాదకరంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

**నియంత్రణ ఎలా?**

పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. అది కూడా ప్రభుత్వ నిధులను ఖర్చు చేయాలి. సీసీ కెమెరాలకు, సిగ్నళ్ల కోసం ప్రజల వద్ద విరాళాలు సేకరించ కూడదని పలు ప్రజాసంఘాలు అంటున్నాయి. అవసరమైన చోట్ల పట్టణాల్లో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలి. దానివల్ల కొంత వరకు వేగం అదుపు చేయవచ్చని అంటున్నారు. మైనర్ బాలలకు బైక్‌లు ఇవ్వకుండా తల్లిండ్రులకు అవగాహన కల్పించాలి.

# హైవేపై ఇల్లీగల్

**కుల్కచర్ల, జూన్ 23, ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల కేంద్రంలోని దాబాలు, రెస్టారెంట్ హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సిట్టింగులు యథేచ్ఛగా జోరుగా కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం వినియోగదారులకు కేవలం భోజన సదుపాయాలు మాత్రమే కల్పించాల్సిన దాబాలు, హోటళ్లు చట్టాన్ని ఉల్లంఘిస్తూ సిట్టింగులు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కుల్కచర్ల మండలంలో 4 దాబాలు, 10కి పైగా రెస్టారెంట్లు ఉండగా, వీటిలో రాత్రి 11 గంటలు దాటినా జోరుగా సిట్టింగులు నిర్వహిస్తూ మూడు పెగ్గులు, ఆరు గ్లాసులు అన్న చందంగా వీటి వ్యాపారం వర్ధిల్లుతోంది. పరిగి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దాబాల్లో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా ఈ మద్యం సిట్టింగులు సాగుతున్నాయి. దాబాల నిర్వాహకులు ఏకంగా ఒక్కరు నుండి ఇద్దరు మనుషులను ప్రత్యేకంగా నియమించుకొని, వైన్ షాపుల నుండి నేరుగా మద్యం బాటిళ్లను దాబాలకు సరఫరా చేయిస్తున్నట్లు సమాచారం. ఇలా దాబాల్లో మద్యం తాగడానికి ఎలాంటి అనుమతులు లేకపోయి నప్పటికీ, ఈ మధ్యకాలంలో ఇవి విపరీతంగా పెరిగిపోయాయి.

**ఊగుతూ..తూగుతూ డ్రైవింగ్**

ఈ దాబాల్లో మద్యం సేవించిన అనంతరం వాహనదారులు మత్తులో అతివేగంగా వాహనాలను రోడ్లపై నడుపుతూ ఘోర రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ప్రమాదాల వల్ల ప్రాణనష్టం జరగడమే కాకుండా అనేకమంది తీవ్రంగా గాయపడి క్షతగాత్రులుగా మారుతున్నారు.



**అనధికార దాబాల్లో యథేచ్ఛగా మద్యం సిట్టింగ్‌లు**

**ప్రమాదాలకు మద్యం సిట్టింగ్‌లే కారణం?**

ఇటీవల కుల్కచర్ల మండల పరిధిలోని కామునిపల్లి గ్రామ శివారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొందరు మృతి చెందగా, ఆ ప్రమాదానికి కూడా ఈ దాబాల్లో జరిగిన మద్యం సిట్టింగే కారణమని స్థానికులు చెబుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉండే దాబాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, అక్కడ మద్యం అమ్మకాలు కానీ, సిట్టిం గులు కానీ లేకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ, అధికారులు ఏ ఒక్కరోజు కూడా దాబాలపై తనిఖీలు చేసిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో జరుగుతున్న ఈ అక్రమ సిట్టింగులపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాబాల నిర్వాహకులు ఇచ్చే నెలవారీ మామూళ్లకు ఆయా శాఖల అధికా రులు తలొగ్గడం వల్లే ఈ తనిఖీలు కరువయ్యాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకుని అక్రమంగా సిట్టింగులు నిర్వహిస్తున్న దాబాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకో వాలని స్థానికులు కోరుతున్నారు.

★ పరిగి-మహబూబ్‌నగర్ రహదారి వెంట దందా ★ గాలికొదిలేసిన తనిఖీలు ★ తప్పతాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు

**అనుమతులు ఇవ్వలేదు .. చర్యలు తీసుకుంటాం : సిఐ**

కుల్కచర్ల మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న దాబాల్లో సిట్టింగులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు అనుమతులు లేకుండా దాబాల్లో, రెస్టారెంట్‌లో మద్యం అమ్మకాలు, కానీ సిట్టింగ్‌లు కానీ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి ఎక్సైజ్ సిఐ నిరజ దేవి రెడ్డి తెలిపారు.

**మత్తు వదలవోయ్...**



మాదకద్రవ్యాలపై అవగాహన కోసం కోట్‌పల్లి మండల కేంద్రంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

## రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ఫోకస్: ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశం



**తాండూరు, జూన్ 23, ప్రభాతవార్త :** పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించేలా దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తాండూరు డిఎస్పీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. సాధారణ వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్టేషన్ రికార్డులు, భద్రత, పరిశుభ్రత, కార్యనిర్వాహణ, సిబ్బంది విధి నిర్వాహణ తీరును నిశితంగా పరిశీలించారు. గ్రామ స్థాయిలో సమాచార, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం, పోలీసు – ప్రజల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో విపిఓ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అదేవిదంగా "సురక్ష మిత్ర " కార్యక్రమం ద్వార ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలు, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించేందకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాద పూర్వకంగా వ్యవహారించాలని సూచించారు.



## ప్రైవేట్ ఉద్యోగికి సైబర్ వల

ఫోన్ హ్యాక్ చేసి

**రూ.1.18 లక్షలు స్వాహా!**

**కొత్తూరు, జూన్ 23, ప్రభాతవార్త :** కొత్తూరు పట్టణంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.1.18 లక్షలు కోల్పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు పట్టణంలోని కృష్ణవేణి స్కూల్ సమీపంలో నివాసముంటున్న యతేందర్ కుమార్ (39) నందిగామలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ నెల 8వ తేదీన సాయంత్రం తన భార్యతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో తన మోటరోలా మొబైల్ ఫోన్ అకస్మాత్తుగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతున్నట్లు బ్లాక్ అయిందని ఆయన తెలిపారు. దీంతో తన మొబైల్ ఫోన్ హ్యాక్‌కు గురైందేమోనని అనుమానించిన బాధితుడు, మరుసటి రోజు తన బ్యాంకు ఖాతాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు తన అనుమతి లేకుండా ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం రూ 1,18,000 లను బదిలీ చేసినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేసిన బాధితుడు, అనంతరం కొత్తూరు పోలీసులను ఆశ్రయించారు. తన ఖాతాల నుంచి డబ్బులు కాజేసిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబర్ నేరగాళ్ల ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రజలు అపరిచిత లింకులు, అనుమానాస్పద యాప్‌లు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## వంట వంట గదుల్ని నీట్‌గా ఉంచండి

**ఎన్కెపల్లి వసతి గృహం సిబ్బందికి కలెక్టర్ ఆదేశం**



మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**పూడూరు, జూన్ 23, ప్రభాతవార్త :** మెనూ ప్రకారం వసతిగృహాల్లో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసితి గృహంలోని వంట, నిత్యావసరాల సరుకుల నిలువ గదులను పరిశీలించి పాఠశాల ఆవరణలో కనీసవసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో కనీస వసతులతో పాటు, డ్రైనేజీ, చిన్న చిన్న మరమ్మతులకు సంబంధించి అంచనాలను రూపొందించి నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. వసతి గృహ పరిసరాలు, వంటసరుకుల నిలువ గదిని పరిశుభ్రంగా ఉడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల, కళాశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు.

అనంతరం పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలను పరిశీలించి వాటి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మహ్మద్ అబ్దుల్ ఘని, తహశీల్దారు విజయ్ కుమార్, స్థానిక సర్పంచ్ టి.దయాకర్, మండల విద్యాధికారి సాయిరెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ మధుసూధన్, వార్డెన్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో ప్రచారం

**షాద్‌నగర్ నేతలకు కెటిఆర్ ఆదేశం**

**షాద్‌నగర్, జూన్ 23, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వై. రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కేటీఆర్‌ను కలుసుకున్నారు. నియో జకవర్గంలో పార్టీ పరిస్థితులపై కేటీఆర్ వారితో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని నాయకులకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా మార్పులు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై అను సరించాల్సిన వ్యూహాలను వివరించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుందని, కార్యకర్తలు ప్రజల మధ్య నిరంతరం ఉండాలని కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు. కెటిఆర్ ఇచ్చిన సూచనలు, సలహాలను కచ్చితంగా అమలు చేస్తామని రవీందర్ యాదవ్ తెలిపారు.



కెటిఆర్‌ను కలుసుకున్న రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్



ఎక్సైజ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## కల్తీ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా

**ఎక్సైజ్ శాఖకు ఎమ్మెల్యే శంకర్ ఆదేశం**

**షాద్‌నగర్, జూన్ 23, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు శాఖ సిబ్బంది హాజరయ్యారు.

సమావేశంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే కల్తీ మద్యం తయారీ, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తించే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజల భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అక్రమ మాదకద్రవ్యాలు, కల్తీ మద్యం నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.

## హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించండి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23, ప్రభాతవార్త :** గర్భిణీస్త్రీలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, ప్రమాద సూచనలను కూడ ముందుగానే గుర్తించాలని, ఇక మాతృమరణాలు భవిషత్‌లో పునరావృతం కాకుండ అవసరమైన చర్యలు చేపట్టాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ డిఎంఅండ్‌హెచ్‌ఓను, మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తన ఛాంబర్‌లో మాతృ మరణాలపై డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టక్ ఉమాగౌరితో పాటు మెడికల్ ఆఫీసర్లతో ఆయన సమీక్ష సమావేశంను నిర్వహించారు. జిల్లాలోని ఉప్పల్, శ్రీరంగవరం, కుత్బుల్లాపూర్‌లో (మూడు హాస్పిటల్స్‌లో) జరిగిన ఘటనలను వివరించారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి జిల్లాలోని ప్రతి కేసు పరిస్థితిని అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ భవిషత్‌లో ఇలాంటి ఘటనలు పురరావృతం కాకుండ తగు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణిల పట్ల వైద్య సేవలు అందించటంలో అప్రమత్తంగ ఉండాలని, పరిస్థితిని గమనించి రెఫరల్ సేవలను బలోపేతం చేయటంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాతృమరణాలను తగ్గించేందుకు అందరు వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి జాగ్రత్తగ ప్రతి రోజు ఆశా, హెల్త్ అసిస్టెంట్, సూపర్‌వైజ్ చేస్తూ ప్రతి రోజు ఫాలోప్ ఉండాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్స్ ప్రత్యేక శ్రద్ధ వహించి సంరక్షణ సేవలు, 102సర్వీసెస్ ఉపయోగించుకుని ప్రతి గర్భిణీకి ఆరోగ్య కేంద్రంలో సేవలు అందించాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ కార్డు ద్వారా గర్భిణీ సంరక్షణ సేవలు, రక్తహీనత సమస్యలను ముందుగానే గుర్తించి అత్యవసర సేవలను జాగ్రత్తగా అందించాలన్నారు. పోషకాహారం గురించి, సాదారణ ప్రసావాల గురించి ఆరోగ్యశాఖ ద్వారా అందించే సేవల గురించి అవగాహన కల్పించటం ద్వారా మాతృ మరణాలు జరగకుండ చూడాలని అన్నారు.



జిల్లా వైద్య అధికారులతో మాతృ మరణాలపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మాతా శిశు సంరక్షణ సేవలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇక ముందు జిల్లాలో మాతృమరణాలు ఒక్కటి కూడ నమోదు కాకుండ ఉండటమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరితో పాటు జిల్లా సంబంధిత అధికారులు డాక్టర్లు గీత, మాదవిలత, లావణ్య, అధికారులు వసంత, యాదగిరి, పిహెచ్‌సిల వైద్య అధికారులు డాక్టర్లు స్వర్ణలత, ప్రతిభగాయత్రి, సౌషిల్యా, అందుల్, వేణుగోపాల్, హెల్త్ హెడ్యుకేటర్ సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మత్తు వదలవోయి..




కోట్‌పల్లి మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలపై బస్టాండ్ కూడలి వద్ద మానవ హారం,




అవగాహన కల్పిస్తున్న ఇన్స్పెక్టర్ నర్సయ్య

**మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం: ఎస్సై శైలజ**

**కోట్‌పల్లి, జూన్ 23, ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉన్నప్పుడే మంచి భవిష్యత్తు గౌరవం లభిస్తాయని కోట్‌పల్లి ఎస్సై శైలజ అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో విద్యార్థులతో మరియు పోలీసు సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించి మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి 2రీ వాక్ నిర్వహించారు. ఈ 2రీ వాక్‌లో సుమారు 250, మంది పైగా విద్యార్థులు పాల్గొని అనంతరం ప్రధాన చౌరస్తా వద్ద విద్యార్థులు మరియు స్థానిక ప్రజలతో కలిసి "మానవ హారం" ఏర్పాటు చేశారు. సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్యంపై మరియు సమాజంపై వాటి ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. స్పష్టమైన లక్ష్యంతో జీవితంలో ముందుకు సాగాలని మాదకద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్‌మీడియాలో అపరిచిత వ్యక్తులతో స్నేహాలు ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. వీలైనంత వరకు దూరంగా ఉంటే మంచిదన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరైమన అలవాట్లు అలవర్చుకుని ఒత్తిడిని సానుకూల మార్గాల్లో ఎదుర్కోవాలని అమె సూచించారు. అలాగే ఈగిల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908 గురించి విస్తృతంగా ప్రచారం చేసి, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఈనంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, విద్యార్థులు ఉపాధ్యాయులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

## డ్రగ్ ఫ్రీ సొసైటీ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

**ఇన్స్పెక్టర్ నర్సయ్య**

**కొత్తూరు, జూన్ 23, ప్రభాతవార్త:**
కొత్తూరు మున్సిపల్ పరిధిలో ఇన్స్పెక్టర్ నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నరసయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తూరు ప్రధాన రహదారిపై మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై వివరించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన చట్టపరమైన శిక్షల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు "నో" చెప్పి, సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్

**..భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన ధరఖాస్తులను పరిష్కరించాలి**

**కీసర, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూన్ 23, ప్రభాతవార్త:**
కీసర మండల తహసీల్దార్ కార్యాలయంను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి తనిఖీ చేశారు. మంగళవారం కీసర మండల తహసీల్దార్ కార్యాలయంను ఆయన సందర్శించి తనిఖీ చేసి భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తుల విషయంపై ఆయన తహసీల్దార్ యాదగిరిరెడ్డితో ఆరా తీశారు. భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ధరఖాస్తులను త్వరగా పరిశీలించి ధరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డిని ఆయన ఆదేశించారు. భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన ధరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డిని ఆదేశించారు.



## ఎస్ఐఆర్‌పై బిఎల్ఓ, బిఎల్ఏకు శిక్షణ శిబిరం



ఘట్‌కేసర్, జూన్ 23, ప్రభాతవార్త: ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అధికారులు శిక్షణ శిభిరం నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు హజరై ఆయా పార్టీలకు చెందిన బోడుప్పల్, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఓ), బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్‌ఏ)లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణ, ఇంటింటికి సర్వే, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, తొలగింపు, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితా సమరణ ప్రక్రియను పారదర్శంగా నిర్వహించాలని సూచించారు. ఈనెల 24 నుంచి జూలై 24 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటికి సర్వే జరుగుతుందని అందరూ సహకరించి ఎస్ఐఆర్‌లో పాల్గొనాలని వారి ఓటును నిర్ధారించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

## వర్షానికి చెరువుల్లా మారిన రోడ్లను పరిశీలించిన జోనల్ కమిషనర్

**అత్తాపూర్ జూన్ 23,ప్రభాతవార్త :**
సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలను మంగళవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి హైడ్రా , జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. శివరాంపల్లి నుంచి అరాంఘర్ వైపు వెళ్లే రహదారిలో దారుల్ ఉలూమ్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరద నీరు నిలిచి ఉండడానికి గల కారణాలు తెలుసుకున్నారు. కాలువల ను విస్తరించి ఇకముందు వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకానున్నట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్ధరాత్రి 12న గంటల నుంచి అధికారుల ఫోన్లతో అప్రమత్తమై నీరు రోడ్లపై నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. గ్రేటర్ కమిషనర్ కమిషనర్




ఆర్ వి కర్ణన్ రాత్రి రెండు గంటల 15 నిమిషాలకు ఫోన్ చేసి రోడ్లపై నీరు నిలవకుండా చూడాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగిందని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలుగా గుర్తించిన 11 ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బందులు కనిపించలేదని తెలిపారు. రాందేవ్ బాబా దేవాలయం సమీపంలో మాత్రం నీరు రోడ్డుపై నిలచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగాయన్నారు . ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించడం జరిగిందని తెలిపారు. నాళాలను విస్తరింపజేసి భవిష్యత్తులో ఎక్కడ వరద నీది నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా చెరువు ల వద్ద గల నాళాలను వాటిపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించడం జరుగుతుందన్నారు. వర్షాకాలంలో ఇంజనీరింగ్, హైడ్రా అదికాదులు అప్రమత్తంగా ఉండాలని సమస్యలున్న ప్రాంతంలో వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. జోనల్ కమిషనర్ వెంట ఎస్ ఈ నరేందర్ గౌడ్, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీ హెచ్ రాజు, హైడ్రా అధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో పారిశుద్ధ్య కార్మికులు




**అత్తాపూర్, జూన్ 23,ప్రభాతవార్త :**
తెలుగు రాష్ట్రాల్లో మున్సిపల్ కార్మికులకు అభివృద్ధి ఫలాలు దక్కక ఆమడ దూరంలో ఉంటున్నారని అఖిలభారత మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు ఆరోపించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాలుగో మహాసభ కాటేదాన్‌లో ఓ గార్డెన్ లో జరుగుతున్న మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో కార్మికులపై పని భారం పెంచి కార్మికులను అనారోగ్యాలకు గురయ్యేలా చేస్తూ చెత్తను సేకరించి వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే వీరికి ఇందులో వొచ్చిన సొమ్ములో భాగం లేకుండా చేస్తున్నారన్నారు. అంటురోగాల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ స్కిల్డ్ లేబర్ వేతనాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 100 అంబేద్కర్లను తయారు చేస్తా అని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి మున్సిపల్ కార్మికుల కుటుంబ పిల్లలకు ఉన్నత విద్య అందుబాటులోకి తేవాలంటే సంక్షేమ పథకాలు వర్తింజేయాలన్నారు. దేశంలో రాష్ట్రంలో ఆకలి కేకల సూచీలో ఎగబాకుతున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సత్వరం నివారణ చర్యలకై ఈ వర్గ కార్మికులకు నూతన పిఆర్‌సి లో మధ్యంతర భృతి 30 శాతం పెంచాలన్నారు. పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు ఓమయ్య, కె.రామాంజనేయులు, రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి ఇన్చార్జి చంద్రయ్య, దళిత పోరాట హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, తదితరులు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం అధ్యక్షులు కే రవిచంద్రన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఏసు రత్నం, ప్రధాన కార్యదర్శి రిపోర్టు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంగం ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, బొడ్డుపల్లి కిషన్, ఉస్మాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, రాష్ట్ర కోశాధికారి హరినాథ్ రావు, మరియు రంగారెడ్డి జిల్లా నాయకులు మద్దిలేటి, టి.ఆనంద్, సాయిలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

## అమరవీరుల స్థూపం ఆవిష్కరణకు సన్నాహాలు

**షాద్‌నగర్, జూన్ 23, ప్రభాతవార్త :** షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం మరోసారి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, స్తూపం పరిసరాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. స్థూపం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించిన ఎమ్మెల్యే, పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. సందర్శకుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయాలని కూడా డైరెక్టర్ కరుణాకర్ కు సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి. కరుణాకర్, దళిత సంఘం నాయకుడు బాదేపల్లి సిద్ధార్థ, యువ నాయకులు ముబారక్ అలీ ఖాన్, తుపాకుల శేఖర్, గోరి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. కాగా, త్వరలో తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్తి చేయాల్సిన పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు, నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు

## నీటిసంపులో పడి చిన్నారి మృతి

**ఘట్‌కేసర్, జూన్ 23, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ 15 నెలల చిన్నారి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలో ఆటోడ్రైవర్ సంపంగి మహేశ్ (30) గత కొంత కాలంగా అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన పాప నైనిక (15 నెలలు) ఆడుకుంటూ ఇంట్లో ఉన్న నీటి సంపులో పడిపోగా కొంతసేపటికి చిన్నారి కోసం చూడగా నీటిలో తేలియాడుతూ కనబడగా వెంటనే సంపు నుంచి బయటకు తీసి ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మహేశ్ తన పాప సంపులో పడి మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



ఎన్ఎఫ్‌సీనగర్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్, జూన్ 23, ప్రభాతవార్త:** దేశసమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో మంగళవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు-మహోన్నత జాతీయవాది డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్‌దివస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి విచ్చేసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. జాతీయత, అఖండ భారత భావనకు ప్రతీకగా నిలిచిన శ్యామాప్రసాద్ ముఖర్జీ త్యాగాలు భారతీయులకు స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. దేశం పట్ల అంకితభావం, జాతీయ ప్రయోజనాల కోసం ఆయన చూపిన నిబద్ధత ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమైనదని ఆయన పేర్కొన్నారు. ముఖర్జీ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్ఆర్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్రనాయకులు కాలేరు రామోజీ, పల్లె మధుసూధన్‌గౌడ్, డివిజన్ ఉపాధ్యక్షులు పడిగెం వీరేశం, గుండ్ల రామతీర్థ, ప్రధానకార్యదర్శి చెల్లక శ్రీధర్, మంగు రాధిక, కిసాన్‌మోర్చ అధ్యక్షులు కట్ట మధుసూధన్‌రెడ్డి, నాయకులు బండ్లగూడెం కిషోర్‌కుమార్‌గౌడ్, గడీల శశికాంత్‌రెడ్డి, మంగు శ్రీనివాస్‌రావు, బూత్ అధ్యక్షురాలు మమతశర్మ, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్పీ పార్టీ ఇంచార్జ్‌ల నియామకం

**కొడంగల్, జూన్ 23(ప్రభాతవార్త):**
బహుజన సమాజ్‌వాది పార్టీ కొడంగల్ అసెంబ్లీ ఇంచార్జ్‌లను నియమించినట్లు ఆ ఆపార్టీ చేవేళ్ళ ఇంచార్జ్ సయ్యద్ అమీర్ తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ కొడంగల్ ఇంచార్జ్‌లుగా వి. రమేష్‌బాబు, కాశీనాథ్‌లను నియమించినట్లు తెలిపారు. ఇందుకుగాను మంగళవారం బీఎస్పీ పార్టీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఇస్వప్ప చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందించారు. అలాగే ఆ పార్టీ కొడంగల్ మున్సిపల్ టౌన్ కమిటీలను నియమించారు. కొడంగల్ అసెంబ్లీ అధ్యక్షులుగా ఎం. శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎం. వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎం. ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా ఎన్. అరుణ్‌కుమార్, కోషాధికారిగా ఎండీ. మహమ్మద్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ పట్టణ అధ్యక్షులుగా కోస్గీ దస్తప్ప, ఉపాధ్యక్షులుగా చిన్న మల్కప్ప, యు. సాయిలు, ప్రధాన కార్యదర్శిగా కోస్గీ కృష్ణ, నడిమింటి భారప్ప, కోషాధికారిగా గంటా శ్యమప్పలను నయమించినట్లు తెలిపారు. కొత్తగా నియమితులైన నాయకులకు నియామకపు పత్రాలను అందించారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన అసెంబ్లీ పార్టీ ఇంచార్జ్‌లు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గ స్దాయిలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.

## రైతుల సౌకర్యం కోసమే విత్తనమేళ



**జిల్లేడు చౌదరి గూడ, కొందుర్గు జూన్ 23.ప్రభాత వార్త :** రైతులు వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమయ్యే నూతన విత్తనాలను అందుబాటులోకి తేవాలనే ఆశయంతోనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ సంయుక్తంగా కలిసి విత్తనమేళ ద్వారా విత్తనాలను పంపిణీకి సిద్ధంగా ఉంచిందని ప్రభుత్వం ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని షాద్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడ రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు ముంగిట విత్తనమేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా
మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన విత్తనాలను అందించడంతోపాటు ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం పై అవగాహన కల్పించేందుకు ఈ విత్తనమేల కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. బిపిటి 52 04, ఆర్ఎన్ఆర్( తెలంగాణ సోనా ) 15 0 4 8, హెచ్ఎంటి సోనా, కేఎన్ఎం 16 38, కేఎన్ఎమ్ 77 15, డబ్ల్యూ జి ఎల్ 44, జైశ్రీరామ్ తదితర కొత్త వరి విత్తనాల గురించి ఆయన వివరించారు. వీటికి ప్రభుత్వం బోనస్ కల్పిస్తుందని తెలిపారు. నానో యూరియా వలన పంటకు ఎంతో బలం చేకూరుతుందని అన్నారు. ఎక్కువ నీటి అవసర మన్నా పంటలకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుములు, శనగలు, నువ్వులు, కూరగాయల విత్తనాలను సాగు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగదీశ్వర్, ఎస్సై విజయ్, ఎంపీడీవో హనుమంత్ రెడ్డి, అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయులు, వెంకట నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, సాయి రెడ్డి, శేఖర్ గౌడ్, చిన్నారెడ్డి తోపాటు వ్యవసాయ విస్తరణ అధికారులు వాసవిరెడ్డి, రమణ, లక్ష్మీ మకాంత్, ఎరువుల దుకాణాల యజమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం



షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత

**షాద్‌నగర్, జూన్ 23, ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, ఓటర్లు తమ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఫారాల్లో తప్పు సమాచారం నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో ఓటర్ల వివరాల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా మిగిలిన వివరాలను కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తయిన వారికే కాకుండా మిగిలిన ప్రతి అర్హ ఓటరికి కూడా ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారాలు సమర్పించని వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. ఓటరు ధృవీకరణకు అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జగ్గంగూడలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

**శామీర్‌పేట, జూన్ 23, ప్రభాతవార్త:**
జగ్గంగూడలోని 13వ వార్డులో ఎస్సీ, బిసి బస్తీలలో విద్యుత్ సమస్య ఉందని దీని పరిష్కారానికి 63కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, నిక్‌మార్ నుంచి వచ్చె లైన్‌కు అనుసంధానం చేయాలని జగ్గంగూడలోని కౌన్సిలర్లు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, జి. జంగారెడ్డిలు విద్యుత్ ఎఇని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డులోని వివిధ బస్తీల్లో విద్యుత్ సమస్య ఉందని, దీనిని పరిష్కరించాలని వారు కోరారు. ఆయా బస్తీల్లో లోఓల్టేజీ సమస్యతో ప్రతి రోజు ప్రజలు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నట్లు, విద్యార్థులు, వ్యాపారులు, గృహాలకు సమస్యలు ఏర్పడుతున్నట్లు వారు తెలిపారు. శాశ్వత సమస్య పరిష్కారానికి కొత్తగా 63కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, ఈ లైన్‌ను నిక్‌మార్ నుంచి వచ్చె లైన్‌కు కలపాలని కోరారు. త్వరగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వారు ఎఇని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘట్‌కేసర్, జూన్ 23, ప్రభాతవార్త: విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా వారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ సెక్షన్ ఇంచార్జ్ ఏఈ ఎం. ప్రసన్నాంజనేయులు తెలిపారు. 11 కెవి శివారెడ్డిగూడ ఫీడర్ పరిధిలోని మారుతీనగర్, శివారెడ్డిగూడ, మైసమ్మగుట్ట, సర్వీస్‌రోడ్డు శ్రీవందన హోటల్, బండారి బ్లోసమ్, మేధా కాలనీ, ఘణాపూర్, పవర్‌గ్రిడ్, పోలీస్‌స్టేషన్, ఎంఎంసి సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి ఎన్ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఘట్‌కేసర్ బుగ్గానగర్, సెయింట్ అంథోనీస్ స్కూల్, అంబేద్కర్‌నగర్, ఈశ్వరా గ్యాస్ ఎజెన్సీ, ఆర్9 ఐస్‌క్రీమ్ కంపెనీ ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, వ్యవసాయదారులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న తహసిల్దార్

## నాణ్యమైన విద్యతోపాటు మంచి విలువలు అందించాలి

..తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్

**పెద్దేముల్, జూన్ 23, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు అందించి వారిని ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దాలని మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం తట్టెపల్లి జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలను స్థానిక సర్పంచ్ నారాయణగౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మద్యాహ్న భోజనంతో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హజరై, బాగా చదివి లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. మద్యాహ్న భోజన కార్యక్రమ నాణ్యతపై ప్రత్యేక శ్రద్ద వహించి, మెను ప్రకారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హజరును పెంచేందుకు తల్లిదండ్రులతో సమన్వయం చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక భాధ్యతలను పెంపొందించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు తట్టెపల్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో కవి ద్వావరి నరేందర్‌రెడ్డికి సత్కారం

**పెద్దేముల్, జూన్ 23, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం భాష సాంస్కృతిక శాఖ 'తెలంగాణ ప్రజాకళ' ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం రాత్రి పాల్కురి సోమన్న వేదికపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో ప్రముఖ కవి ద్యావరి నరేందర్‌రెడ్డి పాల్గొని సత్కారాన్ని అందు కున్నారు. పర్యావరణ ప్రాముఖ్యతను చాటిచెప్పే ఒక చెట్టు జ్ఞాపకం కవిత ను వినిపించి అందరి మన్ననలు పొందారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఎనుగు నర్సింహరెడ్డి ఐఏఎస్ చేతుల మీదుగా సన్మానం పొంది ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు నర్సింహరెడ్డి మాట్లా డుతూ ఆంగ్ల ఉపాద్యాయునిగా విధులు నిర్వహిస్తు తెలుగు కవిత్వం లో విశేష కృషి చేస్తున్న ద్యావరి నరేందర్‌రెడ్డి ఎంతో అభినందనీయులని అన్నారు. కవి ద్యావరి నరేందర్‌రెడ్డికి తాండూరు కవులు సిద్దిలింగయ్య,కోటం చంద్రశేఖర్, గాజుల పవన్‌కుమార్, గాయకుడు బాకారం జయపాల్‌రెడ్డి, రామక్రిష్ణరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దేముల్ జహెచ్‌ఎం సునిత, జిల్లా పిఆర్‌టియు ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనలంలో తమకు అవకాశం కల్పించిన తెలంగాణ బాష సాంస్కృతిక శాఖకు ద్యావరి నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ద్యావరి నరేందర్‌రెడ్డి

## సవరణ ప్రక్రియని జయప్రదం చేయాలి

: తహశీల్దారు విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు తదితరులు

**పూడూరు, జూన్ 23, ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహించే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల బిఎల్‌ఎలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్ 2026)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ,ఫారాల నిర్వాహణ,ఇంటింటి సర్వే,అర్హులైన ఓటర్ల నమోదు,తొలగింపులు,ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సమగ్రంగా అవగామన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దారు వీరేష్‌బాబు,ఎలక్షన్ డిటి అనీల్‌బాబు, డిఎల్‌ఎంటి,అసెంబ్లీలెవెల్ మాస్టర్ శ్రీనివాస్,రాజేష్ రాథోడ్,మండల కాంగ్రెస్,బిఆర్‌ఎస్, బిజెపి,తదితర పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో ఘనంగా విత్తన మేళ

**తలకొండపల్లి జూన్ 23 ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం నాడు ప్రభుత్వం విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విత్తనమేల కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు రమాదేవి అమంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవులు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నేనో సందర్భంగా రైతులకు సరిపోను వర్షాలు కురవకపోవడంతో రైతులు అధికారులు చూయించిన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఆరు తాటి పంటలకు ప్రాముఖ్యత ఇచ్చి వేసుకోవాలన్నారు. నానో యూరియా మరియు నానో డిఏపి లను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం రైతులు వరి పంటలో ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాన్ని జులై 15 తర్వాత నాలు పోసుకోవాలని వారు సూచించారు. వారికి బదులుగా ఆరుతడి పంటలైన కంది జొన్న పెసర మినిమం లాంటి పంటలను రైతులు వెతుకోవాలని వారసూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, తలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, సర్పంచులు శ్రీను శంకర్ నాయక్, తోపాటు ఆయా గ్రామాల మాజీ సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి

-సుల్తాన్‌పల్లి వాగును సందర్శించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్

**శంషాబాద్ జూన్ 23,ప్రభాతవార్త :** సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా సుల్తాన్‌పల్లి గ్రామ పరిధిలోని ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సుల్తాన్‌పల్లి నుండి మొయినాబాద్‌కు వెళ్లే రహదారి పూర్తిగా నీటమునగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ సయ్యద్ సాదత్ అలీతో కలిసి సుల్తాన్‌పల్లి వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రమాదవశాత్తూ వాగు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు.అనంతరం కమిషనర్ తరుణ్ జోషి గ్రామస్తులతో మాట్లాడారు... వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు మరియు విద్యుత్ తీగల సమీపానికి వెళ్లవద్దని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని, చిన్నపిల్లలను కరెంట్ పోల్స్ దగ్గరకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్112కు కాల్ చేసి సహాయం పొందాలని ప్రజలకు సూచించారు.



సుల్తాన్‌పల్లి వాగును పరిశీలిస్తున్న కమిషనర్ తరుణ్ జోషి,డిసిపి,ఇతర పోలీసులు సిబ్బంది

# మా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించండి

-ప్రజాప్రతినిధులు ,అధికారులు పట్టించుకోవడం లేదు
-తోకల శ్రీనివాస్‌రెడ్డితో మొరపెట్టుకున్న విద్యార్థులు,గ్రామస్తులు

**శంషాబాద్ జూన్ 23,ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని విద్యార్థులు,గ్రామస్తులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి మొర పెట్టుకున్నారు.మంగళవారం శంషాబాద్ మండలం పరిధిలోని శంకరాపురం గ్రామస్తులతో పాటు పరిసర గ్రామల ప్రజలు బిజెపి నియోజక వర్గ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డిని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లగా మా గ్రామాలకు సరియైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద గోల్కొండ బహదూర్‌గూడ, అమిదుల్లా నగర్ ,సంఘీగూడ ,శంకరాపూర్ , బురుజుగడ్డ తండా ,షాపూర్ తండా, నుంచి దాదాపు 9 గ్రామాల నుంచి బయలుదేరే పాలమాకుల మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ట్రాక్టర్, డిసిఎంలలో ప్రయాణిం చాల్సి వస్తుందని సమయానికి చేరుకోలేక పోతున్నామని పేద మధ్యతరగతి అయినా మేము ప్రభుత్వ పాఠశాలలో చదివించే మేము మా పిల్లలని డబ్బులు వేచించి ఆటోలో పంపించలేక పోతున్నామని వాపోయారు.స్థానిక నాయకులు, అధికారులకు ఎన్నో సార్లు తమ సమస్యలను విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారం అయ్యే విధంగా మీరు చొరవ తీసుకోవాలని విన్నవించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి స్పందించి వీలైనంత త్వరగా ఆర్టీసి సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ చ్చారు.



తోకల శ్రీనివాస్ రెడ్డితో విద్యార్థులు,గ్రామస్థులు

# భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో అనిత

-నీటూర్,మాటూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహణ

**దౌల్తాబాద్,జూన్ 23,ప్రభాతవార్త:** కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా దౌల్తాబాద్ మండలంలోని నీటూర్,మాటూర్ గ్రామాల్లో అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు.ఈ సంధర్భంగా అధికారులు భూ సేకరణ ప్రక్రియపై మాట్లాడుతూ..నీటూర్ గ్రామంలో సుమారు 52 ఎకరాల 14 గుంటల భూమిని 92 మంది రైతుల నుంచి,మాటూర్ గ్రామంలో 11 ఎకరాల 18 గుంటల భూమిని 26 మంది రైతుల నుంచి సేకరించాల్సి ఉందని వివరించారు.ఎత్తిపోతల పథకం పూర్తయితే సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పుఁ వస్తాయని, రైతుల ఆర్థక స్థితిగతులు మెరుగుపడతాయని అధికారులు పేర్కొన్నారు.రైతులు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానమిచ్చారు.ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా వచ్చిన అభిప్రాయాలను క్రోడికరించి,నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆర్డీఓ అనిత,ఇరిగేషన్ డిఈ శ్రీనివాస్,తహసీల్దార్ వెంకట్ స్వామి,డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారి,స్థానిక సర్పంచ్‌లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

కార్యకర్తలకు ఎంఐఎం ఎమ్మెల్యే మొహమ్మద్ ముబీన్ దిశానిర్దేశం

**ధారూర్,జూన్ 23, ప్రభాత వార్త:** ఏఐఎంఐఎం అధ్యక్షులు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీల ఆదేశాల మేరకు, బహదూర్ పుర ఎమ్మెల్యే మొహమ్మద్ ముబీన్ ధారూర్ మండలంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి ఇతర నాయకులతో కలిసి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ ఐ ఆర్ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తొలగించబడకుండా చూడాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, జిల్లా వ్యాప్తంగా ఓటర్లలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను ధారూర్ వాళ్ళు పూల,శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హాది, జమీర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

తహశీల్దార్ అనంద్‌రావు,

**కోట్‌పల్లి, జూన్ 23, ప్రభాతవార్త;** నకిలీ ఓట్లకు చెక్.. పెట్టెందుకు పకడ్బందీగా ఎస్ఐఆర్, సర్వే పారదర్శకమైన ఓటరు జాబితా రూప కల్పనే ధ్యేయంగా ఎస్ఐఆర్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ అనంద్‌రావు అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో ఎస్ఐఆర్ ఓటరు మ్యాపింగ్‌పై విద్యార్థులకు అన్ని రాజకీయ పార్టీలకు అవగాహన సమావేశ కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రస్తుత ఓటు ఎక్కడుందో అక్కడి బిఎల్‌ఓతోనే మ్యాపింగ్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఎస్ఐఆర్ అనేది అందరికీ వర్తిస్తుందని ఎవరు కుడా నిర్లక్ష్యం చేయకుండా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. మ్యాపింగ్ ఎన్యూమరేషన్‌తో పాటు ఈసీ పేర్కొన్న డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 2002 ఓటరు జాబితాలోని వివరాలను ప్రస్తుత జాబితాలోని వివరాలకు స్వల్ప తేడాలున్న మ్యాపింగ్ పూర్తవు తుందన్నారు. ఎస్ఐఆర్ అవశ్యకతను గుర్తిస్తూ అందరూ మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. ఎస్ఐఆర్‌పై మ్యాపింగ్ ప్రక్రియపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. 2002 ఓటరు జాబితా ఆధారంగా ఇప్పుడు ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉంటే ప్రస్తుతం 2005 ఓటరు జాబితాలోని పేరుతో సెల్ఫ్ మ్యాపింగ్ చేసుకోవచ్చాని అయన సూచించారు. బూత్ లెవల్ అఫీసర్ బిఎల్‌ఓలు, బిఎల్‌ఏ గా ఉన్నారని వారి ద్వారా మ్యాపింగ్ చేయించుకోవచ్చాన్నారు. మన ప్రస్తుత ఓటరు కార్డుని 2002, ఓటరు జాబితాలో ఉన్న వాళ్ళ ఓటరు కార్డును లింకు చేసుకోవడం లేదా మనకు 2002,లో ఓటు ఉంటే దాంతో మనం మనల్ని లింక్ చేసుకోవడం ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. బిఎల్‌ఓలను కలిసి 2002,లో ఓటరు జాబితాలో తల్లితండ్రి ఎవరి పేరు ఉందో వాళ్ళ ఓటరు సీరియల్ నెంబర్, పార్టు నెంబర్, వివరాల్నీ అందజేస్తే ప్రస్తుతం మీరు నివాసం ఉండే ప్రాంతంలో ఓటును మీ పేరుతో మ్యాపింగ్ చేయించుకోవచ్చాన్నారు. అనంతరం మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ. పాఠశాలల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించి వారు తమతమ కుటుంబ సభ్యులకు ఈ సమాచారాన్ని చేర వేయాలని వారు పేర్కోన్నారు, ఈకార్యక్రమంలో బిఎల్‌ఓఏలు, తదితరులు పాల్గోన్నారు,



కోట్‌పల్లి మండల కేంద్రంలో ఓటరు జాబితా మ్యాపింగ్‌పై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ అనంద్‌రావు,

# కారు ఆటో ఢీ: విద్యార్థులకు గాయాలు

**ధారూర్,జూన్ 23, ప్రభాత వార్త:** కారు ఆటో ఢీకొన్న సంఘటన ధారూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ నవీన, శ్వేత, స్వాతి, కృప అనే విద్యార్థులు ఆటోలో వికారాబాద్‌లోని కొత్తగడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్తుండగా,మండల పరిధిలోని రుద్రారం నాగసమందర్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద కారు(టీఎస్ 34 8133) ఆటో(టీఎస్ 07 యూఎ 3317) ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో విద్యార్థులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గాయపడ్డ వారికి తాండూర్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారు కోట్ పల్లి మండల మిషన్ భగీరథ ఏఈ శశికిరణ్ రెడ్డి గా గుర్తించారు. ఢీకొన్న సమయంలో ఏఈ కారులోనే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గురైన వాహనాలను పోలీస్ స్టేషన్ కి తరలించారు. దీనిపై ఎస్ఐకి వివరణ కోరగా, ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ప్రమాదానికి గురైన కారు, ఆటో




## టాక్సీ డ్రైవర్లను ప్రభుత్వం పట్టించుకోవాలి

**శంషాబాద్ జూన్ 23,ప్రభాతవార్త :**

తెలంగాణ టాక్సీ డ్రైవర్ మరియు ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవానికి పుదుచ్చేరి తమిళనాడు కర్ణాటక గోవా,తెలంగాణ కేరళ ఆంధ్ర ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు ,వందలాది ముంది డ్రైవర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ ..ప్రస్తుతం టాక్సీ డ్రైవర్ల మధ్య వైట్ నెంబరు ప్లేట్ల పంచాయితీ ఎక్కువగా ఉందని కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కారు వైట్ ప్లేట్ల వాహనాలతో ఎక్కువగా నష్టం జరుగుతుందని అందుకే 6 రాష్ట్రాల వారిని ఈ సమావేశానికి పిలిపించి తెలంగాణ టాక్సీ డ్రైవర్ అసోసియేషన్ (టి డి టిడిపి)ఆ సమస్యను పరిష్కరించేదిశలో చర్చలు జరుపుతున్నామన్నారు. తమకు ప్రభుత్వం నుంచి ట్యాక్సీలు తక్కువ కావాలని కోరుతున్నామన్నారు. తెలంగాణ స్టేట్ నుంచి తమిళనాడుకు వెళ్తే స్టాంపు వేసుకొని పంపించి వేస్తున్నారు. అదే తెలంగాణ స్టేట్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కి వెళ్తే 3,500 టాక్సులు వసూలు చేస్తున్నారని ఇదెక్కడి అన్యాయమని ఆయన ప్రశ్నించారు .అనంతరం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ..ప్రభుత్వం టాక్సీ డ్రైవర్ సహకరించి యాక్షన్ తగ్గించాలని ఇద్దరు సర్టిఫికెట్లు కూడా తొందరగా అందించాలని చెప్పారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టాక్సీ డ్రైవర్లకు సంబంధించిన ధరలు తగ్గించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించాలని అందుకోసం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శివప్రసాద్ ప్రధాన కార్యదర్శి నరసింహ చారి కోఆర్డినేటర్ ఎం శ్రీకాంత్ బి మహేందర్ శ్రీ ప్రశాంత్ కోశాధికారి ప్రశాంత్ గౌడ్ ఉప అధ్యక్షులునాగుల మహేష్ రమేష్ రణధీ ర్ కిరణ్ కుమార్ సంతోష క విజయ్ రవి మహేష్ బాలరాజు సంతోష్ మహేందర్ శ్రీకాంత్ బి మహేందర్ పాలమాకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



విత్తన మేళాను ప్రారంభించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,

**శామీర్‌పేట, జూన్ 23, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ రైతువేధిక, లాల్‌గడిమలక్‌పేట్‌లోని రైతువేధికల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాలను జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సౌకర్యంగా ఉండేలా రైతు వేధికల్లో విత్తన మేళాలను ఏర్పాటు చేసినట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న రకాలైన విత్తనాలు ఆర్‌ఎన్‌ఆర్, 50వైబి, బిపిటి, హెచ్‌ఎంటి, జైశ్రీరామ్, బిఎన్‌ఎం 1638 రకాలు వేసుకోవాలని వారు సూచించారు. వరి, కూరగాయలు, కందులు, విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఎపి, ఈ మేళాల్లో అందుబాటులో ఉన్నట్లు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు వేధికల్లో ఈ నెల 30వ తేదీ వరకు విత్తన మేళా కొనసాగుతుందని, రైతులకు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్, ఎల్‌డిఎం శివప్రసాద్, డిఎం సీడ్ కార్పోరేషన్ అతుల్‌జైన్, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, ఎఇఒలు శ్రీనాథ్, సుధీర్, రైతులు సంజీవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంతాయిపల్లిలో ప్రాథమిక పాఠశాల పున:ప్రారంభానికి చర్యలు

**శామీర్‌పేట, జూన్ 23, ప్రభాతవార్త:**

అంతాయిపల్లిలో ప్రాథమిక పాఠశాలను పున:ప్రారంభించటానికి, ఏర్పాట్లను పరిశీలించి ఆ తరువాత ఆ గ్రామంలోని బస్తీల్లో, సమీప బిట్స్‌కాలనీలో శామీర్‌పేట మండల విద్యా అధికారి కమలాకర్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిలు పర్యటించి బడిఈడు పిల్లల ను, వారి తల్లి దండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని అంతాయిపల్లిలో ముందుగా ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారం భించటానికి ఏర్పాట్లను పరిశీలించి పిల్లల తల్లిదం డ్రులతో ఎంఇఒ కమలాకర్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి కలిసి మాట్లాడారు. అంతాయిపల్లిలో కొన్నేళ్ల నుంచి ప్రాథమిక పాఠశాల మూసివేసి ఉన్నం దున, పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవటానికి అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించటానికి చర్యలు చేపట్టటానికి వారు సందర్శించి పరిశీలించారు. ముందుగా బడిఈడు పిల్లల కోసం ఇంటింటా పర్యటించి పిల్లలను గుర్తించారు. అంతాయిపల్లి గ్రామంలో, బిట్స్‌కాలనీలో పిల్లలను, తల్లిదండ్రులను కలిసి అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని వారు కోరారు. ఉన్నత విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఎంఇఒ కమలాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టారు. పాఠశాల పరిస్థితిని సంబంధిత అధికారులకు ఎంఇఒ వివరించారు. బడిఈడు పిల్లలను, పాఠశాలకు దూరంగ ఉన్న పిల్లలను కూడ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి మౌళిక సదుపాయాలు, దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటివి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పిల్లలను బడికి పంపాలని వారు కోరారు.



అంతాయిపల్లి సమీపంలోని బిట్స్‌కాలనీలో పర్యటించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరాలని సూచించిన శామీర్‌పేట మండల విద్యా అధికారి కమలాకర్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి దృశ్యం

## బస్సు సకాలంలో వచ్చేలా ఏర్పాటు చేయాలి

సర్పంచ్ చంద్రభూపాల్ రావు

**కుల్కచర్ల,జూన్ 23 ప్రభాతవార్త:** ముజాహద్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలో లోపు బస్సు ఏర్పాటు చేయాలని సర్పంచ్ చంద్రభూపాల్ రావు,మాడల్ స్కూల్ ఫ్రిన్సిపల్ హెప్సిబా అన్నారు. మంగళవారం పరిగి డిపో మేనేజర్ కు వనితి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనుణ, పంచాయతి కార్యదర్శి సంతోష్ కుమార్, కండక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్



రైతు మేళాలో పాల్గొన్న అధికారులు,రైతులు,నాయకులు

## అధిక దిగుబడులే లక్ష్యం

**తిమ్మాపూర్ రైతు వేదికలో విత్తన మేళా**

**కొత్తూరు, జూన్ 23, ప్రభాతవార్త;**
కొత్తూరు మండలంలోని తిమ్మాపూర్ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన విత్తన మేళా రైతుల నుంచి విశేష స్పందన లభించింది.మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు, మండల వ్యవసాయ అధికారి గోపాల్ సంయుక్తంగా మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అధిక దిగుబడి ఇచ్చే వరి రకాలైన తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048),కెఎన్ఎం1638, హెచ్ఎంటి సోనా, డబ్ల్యుజిఎల్ -44, కెఎన్ఎం-7715, బిపిటి-5204 విత్తనాలతో పాటు మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల విత్తనాలను ప్రదర్శించారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియోగంపై వివరాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు రైతు వేదికల ద్వారా ప్రత్యేక విత్తన పంపిణీ కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, తమ ప్రాంతాలకు అనుకూలమైన అధిక దిగుబడి రకాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సుమిత్ర మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ మైసగల్ల శ్రీరాములు, గోనెల ఆంజనేయులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమీన, నిఖిల్, డీలర్లు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపేట రైతు వేదికలో విత్తన మేళా



విత్తన మేళాలో పాల్గొన్న అధికారులు,రైతులు,సర్పంచ్,తదితరులు

**కేశంపేట జూన్ 23 ప్రభాతవార్త :**
వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావచ్చని ఏఈఓ వినయ్ తెలిపారు. కేశంపేట మండలపరిధిలోని కొత్తపేట రైతువేదికలో మంగళవారం రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల ప్రాధాన్యం, శాస్త్రీయ సాగు విధానాలు, పంటల నిర్వహణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు. రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని సూచించారు.వరి సాగులో అధిక దిగుబడులు ఇచ్చే బీపీటీ-5204, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, డబ్ల్యూజీఎల్-44, జై శ్రీరామ్ వంటి వంగడాల గురించి రైతులకు వివరించారు. అనంతరం అల్వాల్ గ్రామ సర్పంచ్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా అవగాహన పెంచు కోవాలని తెలిపారు.

ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేసి, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, నిఖిల్ రెడ్డి,రాజేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### విత్తన మేళా

**మేడ్చల్, జూన్ 23. ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు మేడ్చల్ మండలంలోని పూడూర్ రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభు త్వం బోనస్ అందించే సన్న రకాల వరి విత్తనాలు కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరాం, డబ్ల్యుజీఎల్ 44, బీపీటీ 5204 లు అందుబాటులో వ్యవసాయ అధికారులు తెలిపారు. అదే విధంగా ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరువ చేయడానికి గాను నానో యూరియా, నానో డీఏపీలను కూడా విత్తన మేళాలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, పంటల సాగుకు సంబంధించిన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూడూర్ సొసైటీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, శ్యాంలాల్, రాజు, ఏఈఓ తేజస్విణి, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.



విత్తన మేళాలో పాల్గొన్న రైతులు


### కడ్తాల్ రైతు వేదికలో విత్తనమేళ

**..4 సన్న వరి, ప్రత్యామ్నాయ పంటలు, నానో ఎరువులపై రైతులకు అవగాహన**

**కడ్తాల్, జూన్ 23, ప్రభాతవార్త :** కడ్తాల్ మండల కేంద్రంలో రైతు వేదికలో మంగళవారం విత్తనమేళ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతులందరికీ సన్న వరి రకాల గురించి మరియు వరికి ప్రత్యామ్నాయంగా వేసుకోదగిన పెసర్లు, మినుములు, కందులు, జొన్న, మొక్కజొన్న మరియు కూం̐గాయల సాగుపై అవగాహన కల్పించారు. అలాగే నానో యూరియా, నానో డిఏపి యొక్క ఉప యోగాలు, ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కవిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్ , డైరెక్టర్ సత్యం, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రాఘవేందర్, అభినవ్, శ్రీకాంత్, శిరీష మరియు ఆగ్రో రైతు సేవ కేంద్రం కడ్తాల్ సిబ్బంది మహేష్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై సూచనలు తీసుకున్నారు.

### మోమిన్‌పేటలో విత్తనమేళా

**మోమిన్‌పేట్, జూన్ 23. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల వ్యవసాయ శాఖవారి ఆధ్వర్యంలో ఈ నెల 23.06.26,నుండి 30.06.26.వరకు త్యేక విత్తన మేళా నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు ఇట్టి విత్తన మేళా మండల కేంద్రంలోని రైతువేదిక యందు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడమైందని అన్నారు. ఈ విత్తనమేళాలో ప్రభుత్వం బోనస్ అందిస్తున్న సన్నరకాల వరి విత్తనాల గురించి రైతులకు అవగామన. అవి ఏమనగా.... కేఎన్ఎం-1638, కేఎన్ ఎం-7715, ఆర్ఎన్ ఆర్-15048, హెచ్ ఎంటి-సోనా జైశ్రీరాం, డబ్యు జిఎల్-44, బిపిటి-5204 గల ఇన్ని సన్న రకాల వరి సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయాలని సూచించారు. ఈ విత్తనాలు మొలాలో జనుములు, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు, నానో యూరియా మరియు నానో డీఏపి లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన బికెఎంయు నాయకులు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23, ప్రభాతవార్త:**
విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంను పునరుద్దరించాలని, ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని మేడ్చల్ జిల్లా బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ హెచ్చరించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ మేడ్చల్ జిల్లా బికెఎంయు అధ్యక్షులు తప్పెట్ల రాములుగౌడ్ అధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో కార్మిక ప్రయోజనాలను కాలరాసే విబిజి రామ్‌జి చట్టాన్ని తెచ్చి జూలై 1నుంచి అమలు చేసేందుకు మే 11న నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని, దీన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలతో 25కోట్ల మంది కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి పనులకు గతంలో కేంద్ర ప్రభుత్వం 90శాతం రాష్ట్ర ప్రభుత్వం 10శాతం నిధులు భరించేదని, కొత్త చట్టం ప్రకారం కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు భరించాల్సి ఉంటుందని దీని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పెను భారం పడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎంజి జాతీయ ఉపాధి హామీ పథకంను పునరుద్దరించాలని తోటపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్ఓ మాలతికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తప్పెట్ల రాములుగౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి వి.స్వరూపనాయక్, బికెఎంయు జిల్లా కార్యవర్గసభ్యులు షేక్ అజిత్, వెంకటేశ్‌యాదవ్, కాప్రా మండల బికెఎంయు అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, నాయకులు ఐలయ్యయాదవ్, ఆగమయ్యగౌడ్, యాదగిరి, చంద్రయ్య, కోదాసు జయమ్మ, పి.ఎల్లమ్మ, డి.మల్లిక, తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన బికెఎంయు నాయకులు,పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్, తదితరుల దృశ్యం

## భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

**-ఇబ్బందులు ఎదుర్కొంటున్న బస్తీవాసులు**

**శంషాబాద్, జూన్ 23 ప్రభాతవార్త :**
శంషాబాద్ జోన్ కేంద్రంలోని వివిధబస్తీల్లో మంగళ వారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. వర్షం జోరుగా కురియడంతో ఇంద్రారెడ్డినగర్ బస్తీ పక్కన ఉన్న రాళ్లగుట్ట పై నుంచి వచ్చిన వరద నీటిలో బురద కలసి అది మొత్తం రోడ్లు, డ్రైనేజీల్లో నిండిపోయి డ్రైనేజీలు జాం అయ్యాయి. దానికి తోడు బస్తీ పక్కనే ఉన్న మైనారీ కాలేజీ భవనం ప్రహారీ గోడ బాగలేకపోవడంతో వర్షం నీరు ఆ ప్రహారీదాటి బస్తీలోకి ప్రవహించడంతో బస్తీలోని మట్టిరోడ్డుకోసుకుపోయి ఆ బుదరనీరు కూడ రావడంతో బస్తీలోని అన్ని రోడ్లు బురదమయ మయ్యాయి. కొందరు బస్తీవాసులు జీహెచ్ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో జీహెచ్ఎంసీకి చెందిన ఓ వాహనం వచ్చి డ్రైనేజీలోకి కొన్ని చోట్ల బురద తొలిగించడంతో కొంతమేరకు డ్రైనేజీల్లో నీళ్ల పోతున్నాయి. అయితే చాల చోట్ల రోడ్లపై బురద అలాగే ఉండటంతో కనీసం నడదువటానికి కూడ తీవ్ర ఇబ్బంద రైలు ఎదురవుతున్నాయని తెలుపుతూ కొందరు బస్తీవాసులు ఫోన్లో ఫోటోలు తీసి శంషాబాద్ జోన్ కమీషన్ చంద్రకళకు పంపినట్లు తెలిపారు.
ఎప్పుడు వర్షం పడినా మైనార్టీ కళాశాల ప్రహారీలోని నీళ్లన్ని బస్తీలోకి వస్తాయని ఆ నీళ్ల బస్తీలోని కొన్ని ఇండ్లలోకి వెల్లడంతో పాటు రోడ్లలోకి రావడంతో దర్గంధభరితంగా మారుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. బస్తీలో పేరుకు పోయిన బురదనీటిని తొలగించి తాగునీరు సరపఫరా పూర్తిగా నిలిచిపోయి కనీసం తాగడానికి మంచినీరు కూడ దొరకడంలేదన్నారు. ఇది ఇలా ఉండగా ఈ ప్రాంతానికి తాగు నీళ్ల వదిలే వాటర్ మెన్ ఉద్యోగానికి రాజీనామా చేశాడని దీంతో బస్తీవాసులకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టించుకొని బస్తీలో ట్యాంకర్ల ద్వార తాగునీరు సరఫరా చేయాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఏమేరకు అధికారులు స్పందిస్తారు బస్తీవాసుల కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని అందోళన చెందుతున్నారు.



## మహిళలను కోటీశ్వరులను చేయటమే ప్రభుత్వ లక్ష్యం

**పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్, ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి.**
**జోనల్ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23, ప్రభాతవార్త:**
కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించటం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ విప్ (ఎమ్మెల్సీ)డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ కుశాయిగూడలో ఇందిరా మహిళాశక్తి మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బినగర్, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన 5,62,421మంది మహిళలకు చీరెల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఆ తరువాత మహిళా సంఘాల టీస్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. దీనిలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ దయానంద్, ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ విప్ (ఎమ్మెల్సీ)డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పాటుపడుతుందన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల మహిళలకు చీరెల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను దశల వారీగ అమలు చేస్తున్నామన్నారు. వీరిలో 2,53,056మంద ఎస్‌హెచ్‌జి గ్రూపుల మహిళలు, అలాగే గ్రూపులలో లేని 3లక్షల 13వేల539మంది మహిళలకు ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్పోరేషన్ పరిధిలో 26, 601ఎస్‌హెచ్‌జి గ్రూపులకు చెందిన 2,66, 010మంది మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేయగా, ప్రస్తుతం 2026-27లో 31.53కోట్ల బ్యాంకు రుణాలు అందిస్తున్నామన్నారు. ఎంఎంసి పరిధిలోని 7ఆర్టీసి డిపోలలో గత మూడేళ్లలో 4కోట్ల15లక్షల మంది మహిళలకు ప్రభుత్వం ఉచిత ఆర్టీసి బస్సుప్రయాణం అవకాశం కల్పించిందన్నారు. దీని కోసం ప్రభుత్వం 15కోట్ల రూపాయలు భరించిందని మహేందర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, ఉప్పల్ నుంచి పరమేశ్వర్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, పాల్గొన్నారు.




మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో కుశాయిగూడలో ఇందిరా మహిళా శక్తి చీరెలను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ విప్ (ఎమ్మెల్సీ)డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్,ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాదికగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తదితరుల దృశ్యం




సిమెంట్ అందజేస్తున్న నాయకులు

### నిరుపేద ఇంటికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి జూన్ 23, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన జూలపల్లి మాధవి ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సిమెంటును అందజేశారు. మంగళవారం నాడు జూలపల్లి మాధవికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో తమ ఇంటి నిర్మాణానికి కోసం ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో సిమెంటు పంపిణీ చేశారు. తలకొండపల్లి గ్రామంలో ఎలాంటి పేదవారు లేకుండా అందరికీ ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదుకొని ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమాళ్ళ లలిత జోతయ్య, ఉప సర్పంచ్ జంగయ్య పాండు తదితరులు పాల్గొన్నారు.

### బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ కిడ్స్‌ల పంపిణీ



**తలకొండపల్లి జూన్ 23 ,ప్రభాతవార్త;**
తలకొండపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం నాడు మండలంలోని బిఎల్ఓ లకు ఎస్ ఐ ఆర్ కిడ్స్ లను పంపిణీ చేశారు. స్థానిక తహసిల్దార్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని బిఎల్ఓ లందరికీ ఆయా గ్రామాలలో బిఎల్వోలు ఆయా గ్రామాలలో బిఎల్వోలు ఓటర్ లిస్టులో ప్రత్యేక సవరణ కార్యక్రమానికి అవసరమాగు ప్రభుత్వం అందజేసిన కిడ్స్ లను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓ లను ఉద్దేశించి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని బిఎల్వోలు ప్రతి ఓటర్కు ఎనుమరేషన్ ఫారం అందేలా చూడాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటర్ భాగస్వామ్యం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ జాబితాలో సవరణలు పారదర్శకత్వం పాటించి ప్రభుత్వ నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా వారికి తెలియజేయాలని ఆయన సూచించారు. వారాల్లో తప్పు సమాచారం నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఓటర్ జాబితాలో పేరు కొనసాగాలంటే తప్పనిసరిగా ఇనుమరేషన్ ఫారం సమర్పించే విధంగా చూడాలని వారికి తెలియజేయాలన్నారు. ప్రతిబిఎల్ వాళ్ళ ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని ప్రతి ఓటరు కుతెలియజేసే విధంగా చూడాలని ఆయన సూచన చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ ఎల్ శ్రావణ్ కుమార్, శ్రీకాంత్ తోపాటు మండలంలోని బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

### రక్త హీనత,డెంగ్యూపై అవగాహన

**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుధాకర్‌లాల్**

**కొడంగల్,జూన్ 23(ప్రభాతవార్త):**
పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని నాగారం గ్రామపంచాయతీలో మహిళా సంఘాల సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుధాకర్‌లాల్ పాల్గొని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. రక్త హీనత,డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు .దోమల పుట్టుక,స్థావరాలను గుర్తించి ఎప్పటికప్పుడు దోమలు పుట్టకుండా,కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అలాగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. అలాగే కొడంగల్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌ను కలిసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంఓ సత్యం,జిల్లా నోడల్ ఆఫీసర్ రవి,అంగడిరైచూర్ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బుష్రా ఫాతిమా,నాగారం సర్పంచ్ ప్రశాంతి,డాక్టర్ మహేందర్(ఎంఎల్‌హెచ్‌పి) ఏపీఎం గోపాల్,ఎస్‌హెచ్ఓ పకీరప్ప,వైద్య సిబ్బంది మధుసుదన్‌రెడ్డి,కమలదేవి,జయమాలతో పాటు ఏఎంఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

### గ్రామ సిబ్బందికి శానిటేషన్ కిట్స్, దుస్తులు అందజేసిన రాంపూర్ గ్రామ సర్పంచ్

**తలకొండపల్లి జూన్23,ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ సిబ్బందికి శానిటేషన్ కిట్స్, మరియు సిబ్బందికి దుస్తులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ మాట్లాడు తూ పారి శుద్ధ కార్మికులు దేవుళ్ళతో సమానం వారు నిరంతరం గ్రామం పరిశుభ్రంగా ఉండాలని ఎంతో కష్టపడుతున్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు ముదిరాజ్ ,గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

### బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ పుష్పలత

**జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 23, ప్రభాతవార్త:**
జిల్లేడు చౌదర్ గూడా మండల నూతన ఎంపీడీవో గా పుష్పలత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లాలో సూపరింటెంట్ గా విధులు నిర్వహించిన ఆమె పదోన్నతి పై ఎంపీడీవో వచ్చినట్లు తెలిపారు. మండల అధికారులు ఎంపీడీవో కు స్వాగతం పలికారు. మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంత్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి వినోద్ కుమార్, మదన్, తదితరులు పాల్గొన్నారు.

## బైకు, స్కూటి ఢీకొని వ్యక్తి మృతి

**కుల్కచర్ల,జూన్ 22 ప్రభాతవార్త:** బైకు, స్కూటి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఘనపూర్ గేట్ సమిపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దీప్ల నాయక్ తాండకు చెందిన కత్రావత్ చంద్ర(65) అనే వ్యక్తి కుల్కచర్ల నుండి స్కూటిపై దీప్ల నాయక్ తాండకు వెల్తున్నాడు. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన గణేష్, కృష్ణ అనే యువకులు కుల్కచర్ల వస్తున్న క్రమంలో ఘణపూర్ గేట్‌క్రాస్ చేస్తున్న సమాయంలో రెండు ఢీకొన్నయి. స్కూటిపై వెల్తున్న వ్యక్తి దీప్ల నాయక్ తలకు బలమైన దేబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి**

**మోమిన్‌పేట్, జూన్ 23. ప్రభాతవార్త:**
మారుమూల గ్రామాలలోని పేద ప్రజలు ఉచిత వైద్యశిభిరాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మోమిన్‌పేట్ మండల పరిది లోని టేకులపల్లి గ్రామపంచాయతి కార్యాలయ ప్రాంగణంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన ఎంఎన్ఆర్ ఆసుపత్రి వైద్య బృందం స్థానిక సర్పంచ్ ఆద్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉదయంనుండి సాయంత్రం వరకు దంతాలకు సంబంధించిన ప్రతి సమస్యను పరీక్షించి, క్లీనింగ్, మరియు ప్రాథమిక చికిత్సలు నిర్వహించి అవసరమైతే ప్రత్యేక దంత వైద్య నిపుణులను సంప్రదించి మరోసారి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దంత సమస్యలు న్నవారు దంతక్షయం, చిగుళ్ల సమస్యలు, పుప్పిరి పండ్లు, పంటినొప్పి, చిగుళ్ల నొప్పులున్నటువంటి వారికి అవసరమైన మందులు, టూత్ పేస్టు, బ్రష్ ఉచితంగా అందజేశారని అన్నారు. నేటి ఈ దంత వైద్య శిబిరంలో 37మంది పెద్దవారు కాగా, 30మంది విధ్యార్థులు ,మొత్తం 67 మందికి దంత సమస్యలున్న వారు వచ్చారని వారికి నాణ్యమైన వైద్య పరీక్షలు, సేవలు, అందించి వారందరికి మంచి అవగాహర కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అస్లాం, పంచాయలి కార్యదర్శి మాధవి, ఎంఎన్ఆర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జోసెఫ్ రాయ్, డాక్టర్ సఫ్రాఫాతిమా, మాజీ ఉపసర్పంచులు పాషా, రాయిస్, కారోబార్ నర్సింలు, గ్రామస్తులు ఖదీర్, మోహన్‌రెడ్డి, మాణిక్యం, గౌస్, రమేష్, నర్సింలు, గ్రామస్తులు, డాక్టర్ల బృందం తదితరులు పాల్గొన్నారు.



దంత పరిక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

### డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

**మేడ్చల్, జూన్ 23, ప్రభాతవార్త :** మేడ్చల్‌లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) కార్యక్రమాన్ని మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శైలజ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం పోరాడిన వ్యక్తి ఎక్ దేశ మే దో విదాన్ ,దో నిశాన్, దో ప్రధాన్ నహి చెలెగ అని నినాదించి దేశ సమైక్యతను కాపాడిన మహనీయుడు అని అన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కాను కంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షుడు మైసరి రాజు వంజరి, కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు దోసడి రామచంద్ర రెడ్డి, నాయకులు థాత్రిక లక్ష్మణ్ వంజరి, మామిళ్ళ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ పట్టణంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిజెపి నేతలు

### ఎల్లంపేటలో శ్యామ ప్రసాద్ వర్ధంతి

**మేడ్చల్, జూన్ 23. ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేట కూడలి వద్ద బిజెపి నాయకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్ మున్సి పాలిటీ బిజెపి అధ్య క్షుడు ఎక్కల్ దేవి శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి కంచగంట మహేష్, మహిళా మోర్చా నాయకురాలు పుష్ప మల్లారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేటలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిజెపి నాయకులు

### వాగులను పరిశీలించిన అధికారులు

జిల్లెడు చౌదరి గూడెం, జూన్ 23, ప్రభాతవార్త : జిల్లేడు చౌదరిగూడ మండలంలోని వాగులను మండలాధికారులు పరిశీలించారు. మండలంలోని గుర్రంపల్లి, రావిరాల వాగులను అధికారులు పరిశీలించారు. రాబోయే రోజుల్లో వచ్చే వర్షాల వాగుల వద్ద చేయాల్సి న జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో హన్ మంత్ రెడ్డి, స్పై విజయ్, తదితరులు ఉన్నారు.